# వ్యక్తిత్వం

"హైదరాబాద్ నుండి తిరుపతికి రైల్వే టికెట్స్ బుక్ చేసాను. వచ్చే ఆదివారమే ప్రయాణం. స్కూల్ నుండి రాగానే పాపకి, బాబుకి చెప్పు మనం జగిత్యాల నుండి హైదరాబాద్ దాకా బస్సులో వెళ్ళాలి. శనివారం రాత్రే ప్యాక్ చేసుకుందాం అన్నీను.

ఓకేనా డియర్! ఆర్నెల్ల నుండి తిరుపతో తిరుపతని కలవరిస్తున్నావు. హ్యాపీనా?" అంటూ భార్య నర్మద బుగ్గమీద చిటికేసాడు శివరాం.

ఆమె కళ్ళల్లో వెలుగురేఖలు విచ్చుకున్నాయి.

***

బస చేసిన కాటేజికి లాక్ చేసి శివరాం కుటుంబమంతా దైవ దర్శనానికి బయల్దేరారు.

పిల్లలిద్దరూ తండ్రిని పురాణ కథా సందేహాలతో ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే సహజంగానే భక్తి పరాయణుడైన శివరాం వేంకటేశ్వరుని లీలా విశేషాల్ని ఓపికతో

కమ్మని కథల్లా చెబుతూ పిల్లల హృదయాల్ని రంజింప చేస్తున్నాడు. నర్మద కూడా తన్మయురాలవుతోంది.

భక్తిప్రపత్తులతో అడుగులు ముందుకు వేస్తున్న వాళ్ళ మార్గానికి ఎదురయ్యాడొక వ్యక్తి.

"అయ్యా ధర్మం చేయండి" అన్నాడు రెండు చేతులూ ముందుకు చాచి.

మాసిన గడ్డం, చెదిరిన జుట్టు మినహా మరీ బిచ్చగాడి అవతారంలా లేదతని వాలకం. నడి వయసు, వదనం పీక్కుపోయినట్టు అలసటగా ఉంది. మనిషి సన్నగా పీలగా ఉన్నాడు.

శివరాం ముఖాన్ని కందగడ్డలా చేసుకుంటూ "దుక్కలా ఉన్నావు. అడుక్కోవడానికి సిగ్గుగా లేదు?" అన్నాడు కాస్త తీవ్రంగా.

అడుక్కునే వాళ్ళమీద సదభిప్రాయం లేదతనికి.

హ్యాండ్ బ్యాగ్‌లోంచి కొంత చిల్లర తీసి వేయడానికి ఉపక్రమించిన నర్మద భర్త మాటలతో తన చర్యకి బ్రేక్ వేసింది.

"అయ్యా! అంత కోపం దేనికి? అయినా దొంగతనం చేస్తే సిగ్గుపడాలి. దోపిడీకి పాల్పడితే తలదించుకోవాలి. కానీ నేను చేస్తున్నది భిక్షాటన. ఉన్నవాళ్ళనే అర్థిస్తున్నాను. ఇచ్చినంతనే తీసుకుంటున్నాను. మీకిష్టమైతే దానం చేయండి. లేకపోతే లేదు" వీలైనంత శాంతం ప్రదర్శించాడా వ్యక్తి.

"అడుక్కోవటం కాక నీతులొకటా? పో! పో!" కసురుకుంటూ ముందుకు నడిచాడు శివరాం.

ఆ వ్యక్తి మౌనంగా పక్కకి వైదొలిగాడు.

దేవాలయానికి వెళ్ళి కంకణాలు కట్టించుకున్నాడు. ఇరవై ఎనిమిది గంటల అనంతరం దైవ దర్శనానికి సమయం కేటాయించబడింది. వెనుదిరిగారు.

మరుసటి రోజు క్యూలో...

పిల్లలిద్దరికి చెరొక అయిదు వందలిచ్చి "ఇవి హుండీలో వేయండి. నర్మా! నువ్వు కూడా" అంటూ భార్య చేతికి డబ్బిచ్చాడు శివరాం.

"ఇందులో నుంచి ఓ పదో పరకో నిన్నటి బిచ్చగాడికి ఇచ్చుంటే కాస్త పుణ్యమైన దక్కేది కదండీ!" గొణిగింది నర్మద అయిదొందలు తీసుకుంటూ.

"ఏం దేవుడికిస్తే పుణ్యం రాదా?" భార్య మాటలకి ముఖం చిట్లించాడు.

"అహా... అది కాదు. ఏ ఆపద ఉందో పాపం అతనికి. అన్నీ అనుకూలించి ఉంటే పనిపాటా చేసుకుంటూ హాయిగా ఉండక... వ్యక్తిత్వం వదులుకొని ఇలా ఎందుకు అడుక్కుంటాడండీ! ధర్మకార్యమే దైవకార్యం అన్నారుకదా" అంది.

"దైవ దర్శనానికి వెళ్తున్నప్పుడు నన్ను విసిగించకు. కాస్త మైండ్ ఫ్రెష్‌గా ఉండనీ" అని భార్య చర్చ ఆమోదయోగ్యం కాక తల పక్కకు తిప్పుకున్నాడు.

సమయం గడుస్తోంది.

తోపుడు, నెట్టుడు... అంత ప్రాయాసపడి ఇంత దూరం వస్తే-

ఎట్టకేలకు క్షణకాల దర్శనం! క్యూలోంచి బయటపడ్డారు.

"నెక్స్ట్ ప్రోగ్రాం?" భార్యనడిగాడు శివరాం గుడి దాటాక.

"ఆకలి దంచేస్తోంది. ముందేదైనా తిందాం డాడీ!" బాబు ప్రపోజ్ చేసాడు.

"ఓకే మై చైల్డ్ డన్!" అంటూ భార్యా పిల్లల్ని దగ్గరున్న హోటల్ వైపునకు తీసుకువెళ్ళాడు.

టీ, టిఫిన్స్ ముగించుకొని బిల్ పే చేయడానికి జేబులో చేయిపెట్టిన శివరాం అదిరిపడ్డాడు.

పర్స్ లేదు! షర్ట్, ప్యాంట్ అంతటా వెతికాడు కంగారుగా.

"పర్స్ నీగ్గాని ఇచ్చానా?" భార్యనడిగాడు. అడ్డంగా తలూపిందామె.

ముచ్చెమట్లు పోసాయతనికి. నర్మదలో టెన్షన్ మొదలయ్యింది. తన హ్యాండ్ బ్యాగ్ వెతికింది. కొంత చిల్లర డబ్బుంది. బిల్‌కి పోను అయిదు రూపాయలు మిగిలాయి.

అప్పటికి ఊపిరి పీల్చుకుంటూ హోటల్లోంచి బయటపడ్డారు.

డబ్బు విషయంలో అతి జాగ్రత్తగా ఉంటాడు శివరాం. ఇప్పుడిలా జరగడం అతను తట్టుకోలేకపోతున్నాడు.

తెచ్చుకున్న మొత్తం డబ్బే కాదు. అవసరానికి పనికొస్తుందనుకున్న ఎ.టి.ఎమ్ కార్డ్ కూడా పోయింది. ఎవ్వరూ ఏం మాట్లాడలేదు. కొంత డబ్బు కాటేజ్‌లో దాచినా బాగుండేదని ఇప్పుడన్పిస్తోంది.

చేసేదేం లేక కాటేజ్ వైపు కదులుతుంటే-

అంత జనం లోనూ ఊహించని విధంగా నిన్నటి వ్యక్తి మళ్ళీ తారసపడ్డాడు.

"ఇదిగో... ఈ అయిదు రూపాయలుంచు" ఏమనుకుందో ఏమో ఈసారి భర్త అనుమతి లేకుండానే నర్మద పిలిచి మరీ హ్యాండ్‌బ్యాగ్‌లోంచి నోటు తీసి అతనికిచ్చింది.

అటు చూడనైనా చూళ్లేదు శివరాం.

"అందరూ చల్లగా ఉండాలమ్మా!" అతని దీవెనకి శివరాం పెదాలపై నిర్లిప్తత కదలాడింది.

ఊరికి ఎవరికి ఫోన్ చేసినా తనకి డబ్బు ఎలా చేర్తుంది? అందాక ఇక్కడ పరిస్థితి? తెల్సిన వాళ్ళెవరూ ఇక్కడ కన్పించట్లేదు. మైండ్ హీటెక్కుతోంది శివరాంకి.

"నిన్న వెంకన్న-పద్మావతి దంపతుల్లా నవ్వుతూ కన్పించారు. నేడేమో బాధగా కన్పిస్తున్నారు. చొరవ అనుకోకపోతే..." వెనుదిరిగిన వాడల్లా చప్పున ఆగి అడిగాడు.

"మా డాడీ పర్స్ కొట్టేసారెవరో"! టక్కున అంది పాప.

"మా ఊరెళ్ళాలంటే ఎంత లేదన్నా పదిహేను వందలైనా కావాలి" బాబు పొడిగించాడు.

విషయం అర్థమైందతనికి.

"సార్! మీరేమనుకోనంటే ఒక్కమాట..." వెళ్ళిపోతున్న శివరాంని ఆపాడా వ్యక్తి, మిగతా కుటుంబ సభ్యులూ ఆగిపోయారు.

"మీక్కావాల్సిన డబ్బు నేనిస్తాను. తీసుకోండి" అంటూ ప్యాంట్ లోపలి జేబులోంచి కొంత డబ్బు తీసి లెక్కపెట్టి పదిహేను వందలు చేత్తో పట్టుకున్నాడు.

"సార్! ఒకప్పుడు నేనూ బాగా బతికిన వాడినే! కానీ నేడందరూ వెలివేసినట్టుగా చూస్తున్నారిప్పుడు. అందుకే నా వాళ్ళనుకున్న వాళ్ళందరిని వదిలి ఊరికి దూరంగా ఇదిగో ఈ పవిత్ర ప్రాంతంలో భిక్షాటన చేస్తున్నాను అయిదేండ్లనుండి.

పెళ్లి చేసుకోలేదు. ఇక్కడా ఏదో పని చేసుకోవచ్చు. కానీ ఎప్పుడైనా నాకు ఎయిడ్స్ ఉందని తెలిస్తే అప్పుడే పని చేయించుకునే వాళ్ళు వెలివేస్తారు. అందుకని ఆ ప్రయత్నం మానుకుని ఈ పద్ధతి చేపట్టాను.

నా తిండికి పోను అడుక్కుంటున్న దాంట్లో డబ్బు దాస్తున్నాను. నాకంటే

దైన్య స్థితిలో వున్న వాళ్లకోసం, ధర్మకార్యాలకోసం ఖర్చు చేస్తుంటాను.

**ఆపదలో ఉన్నారు మీరు. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడం ధర్మకార్యమేనని తలుస్తున్నాను.**

ఈ డబ్బు స్వీకరించడానికి మీకు మనసొప్పకపోతే ఒక పన్జేయండి. మళ్లీ ఎప్పుడైనా మీరిక్కడికి వస్తే నేను కనబడితే నా డబ్బు నాకు వడ్డీతో సహా ఇచ్చేయండి.

నేనెప్పుడు నేలరాలతానో నాకే తెలీదు. ఒకవేళ మీకు నేను తటస్థ పడకపోతే నేనిచ్చిన ఆ డబ్బుకి మరికొంత కలిపి నా పేరు మీద బీదకో పేదకో సాయం చేయండి. లేదా నాలా అడుక్కునే వాళ్ళకి దానం చేయండి. నా పేరు శ్రీనివాసులు" అంటూ డబ్బు అందించాడు.

తను దానం చేయకపోయినా తనకి సాయం అందించడానికి సిద్ధపడ్డ శ్రీనివాసులు మహోన్నతంగా అన్పించాడు శివరాం కళ్ళకి.

**'వ్యక్తి కాదు వ్యక్తిత్వం ముఖ్యం' అనుకున్నాడు.**

డబ్బందుకోవడానికి సిద్ధపడిన శివరాం చాచిన చేతులు అప్రయత్నంగా వణికాయి. అప్పుడు శ్రీనివాసులు వంక కాకతాళీయంగా చూసిన నర్మదకి అతడి వదనం దివ్యకాంతి ప్రభలతో వెలిగిపోతున్నట్లన్పించింది.

**(27.10.2005)**

*